క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మర్పల్లి: గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీపీ బట్టు లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ రానున్నారని, సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

అంబేడ్కర్‌కు నిత్య పూలమాల


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సార్సర్

అనంతగిరి: వికారాబాద్‌లోని రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పట్టణానికి చెందిన మయూర్ సార్సర్ నిత్యం పూలమాల వేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నాటికి 500 రోజులు పూర్తయింది. దీంతో ఈ యువ నాయకుడు చేస్తున్న పనికి పలువురు అభినందనలు తెలిపారు.

బంజారా భవనానికి రూ.3 కోట్లు


ఎమ్మెల్యేను సన్మానించిన బంజారా గిరిజన నాయకులు

పెద్దేముల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో గిరిజన బంజారా భవనానికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ధన్‌సింగ్ చెప్పారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని బంజారా గిరిజన నాయకులు కలిసి సన్మానించారు. ఇందులో ఎంపీటీసీ ధన్‌సింగ్, సర్పంచ్‌లు భరత్, పాండు నాయక్, గోవర్ధన్ నాయక్, జయరాం నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవినాయక్, ఎస్టీసెల్ అధ్యక్షుడు విజయ్, మండల నాయకుడు సురేష్ తదితరులు ఉన్నారు.

వీధి నాటకాలకు ప్రోత్సాహం

యాలాల: వీధి నాటకాలకు తమ వంతుగా ప్రోత్సాహం అందజేస్తామని దేవనూరు సర్పంచ్ శివకుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెట్లి ఆశన్న అన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న భక్త సిరియాల రెండో రోజు నాటక ప్రదర్శనకు వారు ముఖ్య అతిథిగా హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతరించి పోతున్న కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం నాటక నిర్వాహకులకు ఆశన్న రూ.11 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లప్ప, శ్రీను, వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

అమ్మభవానీకి పల్లకీ సేవ


అమ్మవారి పల్లకీ సేవలో భక్తులు

కొడంగల్ రూరల్: పెద్దనందిగామ భవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి అభిషేకం అనంతరం విశేష అలంకరణ, మంగళహారతులు పడుతూ.. దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన పాలకవర్గం సభ్యులు

శంకర్‌పల్లి: జనవాడ షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడిగా నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నగరంలోని లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం రాష్ట్ర అధ్యుడు సుదర్శన్ బాబు, జిల్లా అధ్యక్షుడు శివశంకర్ సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రవీణ్, అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస్, భూపాల్, అరుణ్‌లు ఎంపికయ్యారు. నూతనంగా అధ్యుడు నగేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు.

ఆయన జీవితం ఆదర్శనీయం

బాబు జగ్జీవన్ రామ్ జయంతిలో వక్తలు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్ అని వక్తలు చెప్పారు. మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం జిల్లాలో సకలజనులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. కుల నిర్మూలన, సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన మహనీయుడు జగ్జీవన్ అని కొనియదారు. నేటి తరానికి ఆయన జీవితం ఆదర్శనీయని, జగ్జీవన్ అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు.

– సాక్షి, నెట్‌వర్క్


తాండూరు టౌన్: తన కార్యాలయంలో జగ్జీవన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి


కొడంగల్‌లో.. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


పరిగిలో.. డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి


తాండూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో.. ఎంపీపీ


పెద్దేముల్: రుక్మాపూర్‌లో..


దోమలో.. సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు


బొంరాస్‌పేట: వడిచర్లలో..


మర్పల్లి: పట్లూర్‌లో.. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్


అనంతగిరి: ఎంపీడీఓ కార్యాలయంలో..


మోమిన్‌పేట: దేవరంపల్లిలో..


దౌల్తాబాద్‌లో..


యాలాలలో..


కుల్కచర్లలో..


బంట్వారం: కోట్‌పల్లిలో..

లీకేజీతో తపస్‌కు సంబంధం లేదు

- ఉపాధ్యాయ సంఘాన్ని నిందించొద్దు
- 'తపస్' పేరు ప్రస్తావించడాన్ని ఖండిస్తున్నాం: టీపీయూఎస్

వికారాబాద్ అర్బన్: తాండూరులో 10వ తరగతి తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) పేరును ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రస్తావించడాన్ని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కొత్తగడి అంజిరెడ్డి, మహేందర్ బహదూర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. లీకేజీకి కారణమైన ఉపాధ్యాయుడు బందెప్ప మరో ఉపాధ్యాయ సంఘంలో కొనసాగుతుంటే, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తపస్ సభ్యుడిగా ప్రస్తావించడం దారుణమన్నారు. పోలీసుల విచారణలో బందెప్ప నేరం ఒప్పుకున్నా.. ఆ విషయాన్ని తపస్ సంఘానికి అంటగట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలోకి ఉపాధ్యాయ సంఘాన్ని లాగడం సరైంది కాదని హితవుపలికారు. పేపర్ లీకేజీకి పాల్పడిన బందెప్ప, సమ్మప్పలతో తపస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని వారు తెలుసుకోవాలని సూచించారు.

ఆరోపణలు సరికాదు..



దోమ: పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో టీపీయూఎస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం)నేతలు ఉన్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించడాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు తీవ్రంగా ఖండించారు. టెన్త్ పేపర్ లీకేజీ విషయంలో బందెప్ప అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అయినా.. అతనికి తపస్ సంఘం సభ్యులతో సంబంధం ఉందని చెప్పడం మంచిదికాదని, ఆ వ్యక్తితో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, బందెప్ప ఓ ఉపాధ్యాయ సంఘంలో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

విధుల్లో బాధ్యత మరవొద్దు

యాలాల: ఎవరి విధులు వారు బాధ్యతగా నిర్వర్తిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోవడం బాధాకరమే అయినా.. వారు చేసింది పెద్దతప్పేనన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కొందరి ప్రయోజనాల కోసం ఉపాధ్యాయులు తప్పుడు మార్గాన్ని ఎన్నుకోవడం మంచిది కాదన్నారు. ఈ ఘటన మిగితా ఉపాధ్యాయులందరికీ.. కనువిప్పు కలుగుతుందని చెప్పారు.

మన్నెగూడ సంత.. సమస్యల చింత

- కనీస వసతులు కరువు
- సతమతమవుతున్న క్రయవిక్రయదారులు
- నిధులున్నా.. నిర్మాణం కాని మార్కెట్‌యార్డు
- ఆదాయం సమకూర్చుకుంటున్న జీపీ
- సౌకర్యాల కల్పనలో వెనుకడుగు


షెడ్ లేక పరదాల మాటున కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

పూడూరు: వారాంతపు సంతలో సౌకర్యాలు లేక వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు దశాబ్దాలుగా మన్నెగూడ చౌరస్తాలో ప్రతి మంగళవారం జరిగే అంగడికి మండల పరిధిలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు కూరగాయలు తెచ్చి విక్రయిస్తుంటారు. క్రయవిక్రయదారులతో కిటకిటలాడే మార్కెట్‌లో కనీసక వసతులు కరువయ్యాయని ప్రజలు, వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సౌకర్యాల సంగతి ఎలా ఉన్నా.. షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండి.. వానకు నానాల్సి వస్తోందని వాపోతున్నారు. తాగునీరు, విద్యుత్తు దీపాలు కూడా లేవని, సాయంకాలం అయితే తాత్కాలిక విద్యుత్ దీపాల వెలుతురులో కూరగాయలు అమ్ముతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతలో షెడ్లు ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరైనా..

మన్నెగూడ మార్కెట్ యార్డు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో పనులు సాగడం లేదని స్థానికులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు. గతంలో రెండు పర్యాయాలు మార్కెటింగ్ శాఖ అధికారులు సంతను పరిశీలించి.. ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని మార్కెటింగ్‌కు అప్పగించారు. ప్రభుత్వం మార్కెట్ కోసం రూ.15 లక్షలు కేటాయించింది.

తైబజార్ వేలం వేసినా..

కొన్నేళ్లుగా తైబజార్‌ను వేలం వేస్తున్నారు. అయినప్పటికీ.. మార్కెట్‌లో ఎలాంటి వసతులు కల్పించడం లేదని, తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం లేదని వ్యాపారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతరోజున ప్రతి దుకాణానికి డబ్బులు వసూలు చేస్తూ.. పంచాయతీకి ఆదాయం సమకూర్చుతున్నారే కానీ.. ఇక్కడ సౌకర్యాల సంగతి మరిచారని విమర్శిస్తున్నారు.

మరోసారి అంచనా..



మార్కెట్ నిర్మాణం కోసం ఈజీఎస్ ద్వారా మూడేళ్ల క్రితం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈజీఎస్ బిల్లులు ఆలస్యం కావడంతో నిర్మాణం చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. స్థలం కూడా మార్కెట్ అధికారులకు అప్పగించడం జరిగింది. ఈజీఎస్ ద్వారా పది లక్షలతో పాటు, పంచాయతీ నుంచి రూ.5లక్షలు కేటాయించాం. రీ ఎస్టిమేషన్ వేయించేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మార్కెట్ అందరికీ సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి, మన్నెగుడ

హామీలు మరిచిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ హయాంలో తండాల అభివృద్ధి
- హాత్ సే హాత్ జోడో యాత్రలో నాయకులు


దౌల్తాబాద్: ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్: ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా బుధవారం కస్తూర్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే.. చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆశిస్తే.. వాటి ఊసే లేకుండా పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, నాయకులు సోమశేఖర్, కౌన్సిలర్ శంకర్‌నాయక్, దాము, ఆనంద్‌రెడ్డి, పెద్దనందిగామ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, తార్యానాయక్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన తండాలు అభివృద్ధి చెందాయని మాజీ వైస్ఎంపీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. జోడో యాత్రలో భాగంగా పోచమ్మగడ్డతండా, సోమ్లానాయక్‌తండా, రామస్‌కుంటతండాల్లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంటి స్థలం ఉన్న పేదవారికి రూ.5లక్షలు, రూ.500లకే సిలిండర్, రూ.2లక్షల రుణమాఫీ, వరిపంటకు రూ.2,500 మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకట్రాములు, వీరన్న, దస్తప్ప, రాజు, మాధవరెడ్డి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భూమిపూజ


భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ రాందాస్ నాయక్ తదితరులు

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జెడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం చౌడాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం బూరెడ్డిపల్లిలో బుడగజంగాల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సర్పంచ్ కొత్త రంగారెడ్డి, బుడగజంగాల సంఘం అధ్యక్షుడు భీమయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటేశ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం..

నేడు హనుమాన్ జయంతి వేడుకలు


బండబావి ఆంజనేయ స్వామి ఆలయం (ఫైల్)

అనంతగిరి: హనుమాన్ జయంతి సందర్భంగా అనంతగిరి గుట్టకు వెళ్లే మార్గంలో కొలువై ఉన్న స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన శ్రీ బండబావి ఆంజనేయ స్వామి వారి దర్శనం కోసం భక్తులు నిత్యం వస్తుంటారు. జయంతి సందర్భంగా నిర్వహించే వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు చెప్పారు.

సుప్రభాత సేవతో..

ఉదయం 6గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమం మొదలవుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయం 6.30గంటలకు పంచామృత అభిషేకం, 7.30 గంటలకు మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, 10.30గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు ఊయల సేవ జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శోభాయాత్ర..

బజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్, హిందు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పట్టణంలోని ఆలంపల్లి హనుమాన్ మందిరం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ శోభాయాత్ర నిర్వహించనున్నారు.

తాండూరులో..

తాండూరు: తాండూరు హిందు ఉత్సవ కేంద్ర సమితీ ఆధ్వర్యంలో నేడు హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు సమితీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ హనుమాన్ దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

శివసేనారెడ్డిని విడుదల చేయండి

యూత్ కాంగ్రెస్ నాయకుల ధర్నా, అరెస్టు

చేవెళ్ల: టెన్త్ ప్రశ్న పత్రాల లీకేజీతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం చేతకాని తనం వల్లే ఇలా జరుగుతోందని యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ చేవెళ్లలో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు దీనిని అడ్డుకొని నిరసన తెలుపుతున్న యూత్ నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఇలాకాలో మొదట పేపర్ లీక్ కావడం విడ్డూరంగా ఉందన్నారు. పేపర్ లీకేజీలపై ప్రశ్నించే వారిని ప్రభుత్వం అరెస్టులు చేయిస్తుందని మండిపడ్డారు. శివసేనారెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సుశాంత్, తిరుపతి, మండల కార్యదర్శి దామోదర్, ఉపాధ్యక్షుడు జైస్‌రామ్‌రెడ్డి, యాదగిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

9న రెడ్డి ఆత్మీయ సమ్మేళనం


మోమిన్‌పేట: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

మోమిన్‌పేట: ఈ నెల 9వ తేదీన వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్లో జరగనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళానికి అందరూ తరలిరావాలని రెడ్ల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో పోస్టర్ ఆవిష్కరించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: వికారాబాద్ పట్టణం సత్య భారతి గార్డెన్‌లో ఆదివారం జరిగే ఆత్మీయసమ్మేళనానికి రెడ్డి బంధువులు అధికసంఖ్యలో తరలిరావాలని రెడ్డి ఐక్యవేదిక వ్యవస్థాపకులు, రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో వికారాబాద్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రెడ్డి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మండల సభ్యులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: వికారాబాద్‌లో జరిగే రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలని రెడ్డి జాగృతి జిల్లా కార్యదర్శి శరణారెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రెడ్డి కార్పొరేషన్ సాధనతో పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కోసం కలిసికట్టుగా నడుద్దామన్నారు.